ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాలి

'జగనన్న సురక్ష' అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత సచివాలయాలపై ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలనే సంకల్పంతో ముందుకుపోతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లులా పాలన కొనసాగుతోందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డు, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టామన్నారు. ఒక్కొక్క చోట రూ.20లక్షలు మేరకు ప్రాధాన్యం క్రమంలో పనులు చేపట్టామని చెప్పారు. గతంలో వివిధ రకాలైన సర్టిఫికేట్లు కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు సచివాలయాలతో వలంటీర్లు, ఉద్యోగుల క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మాజీ కౌన్సిలర్ కాగిత సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకే 'జగనన్న సురక్ష'

కర్లపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని తెలుసుకుని, మంజూరు చేసేందుకు సీఎం వైఎస్ జగన్ సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని కర్లపాలెం ఎంపీడీవో, డీపీవో దాసరి రాంబాబు తెలిపారు. శనివారం మండలంలోని చింతాయపాలెం, దుండివారిపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే ప్రారంభమైంది. దుండివారిపాలెంలో జరుగుతున్న కార్యక్రమాన్ని తహసీల్దార్ కేశవనారాయణరావు పర్యవేక్షించారు. చింతాయపాలెం గ్రామంలో డీపీవో రాంబాబు పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరం మేరకు కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుడి ధృవీకరణ పత్రాలు, మ్యూటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం చేయటం, కౌలు రైతులకు సాగు ధృవీకరణ పత్రాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాలలో దుండివారిపాలెం సర్పంచ్ పులుగు గోవిందమ్మ, చింతాయపాలెం ఎంపీటీసీ రాతంశెట్టి లక్ష్మణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, వీఆర్వోలు యశ్వంతి, సుభానీ, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరావు, వీరాస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఖాజీపాలెంలో పరిశీలిస్తున్న తహశీల్దారు కవిత


ధూళిపూడిలో పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ పార్థసారథి

'జగనన్న సురక్ష'తో సమస్యలు పరిష్కారం

రేపల్లె రూరల్: తహసీల్దార్ డి.మల్లికార్జునరావు జగనన్న సురక్ష కార్యక్రమంపై బేతపూడి గ్రామంలో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, సమస్యలు పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించదన్నారు. నెల రోజులపాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, 11 రకాల ధ్రువీకరణ పత్రాలు సర్వీస్ చార్జ్ లేకుండా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులతో కూడిన బృందం ప్రతి ఇంటినీ సందర్శిస్తుందన్నారు. సంక్షేమ లబ్ధి పొందని వారిని గుర్తించి, సమస్య పరిష్కారానికి కావాల్సిన పత్రాలు సేకరిస్తారని చెప్పారు. దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి, వాటిని అక్కడ సమర్పించి, టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకుని వాటిని తిరిగి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారన్నారు. అర్హులను గుర్తించి పథకాలే కాకుండా వారికి కావల్సిన డాక్యుమెంటేషన్లు కూడా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పిట్టలవానిపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలను ఖాజీపాలెంలో తహసీల్దార్ కవిత, భవనంవారిపాలెంలో ఎంపీడీఓ భవనం మారుతీ శేషాంబ పరిశీలించారు. బాపట్ల డీఎల్‌డీఏ చంద్ర సువార్త మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగింపుగా ఉంటుందని తెలిపారు. భవనంవారిపాలెం ఎంపీటీసీ సభ్యులు దొంతిరెడ్డి సింధు, కోటిరెడ్డి, సర్పంచ్ కుంతం అనూష, ప్రసన్నరాజు, కూసంపూడి దేవేంద్రరాజు ఇవోపీఆర్డీ కె.పద్మజ, గ్రామ కార్యదర్శులు వసుంధరలక్ష్మి, శ్రీనివాసరావు, వీఆర్వోలు నాగరాజురెడ్డి సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఐలవరంలో 'జగనన్న సురక్ష' ప్రారంభం

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ..నూరుశాతం సంక్షేమ ఫలాలు అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ సెక్రటరీ ఎండీ జిక్రియ, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, పంచాయతీ వార్డు సభ్యులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

నగరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని రేపల్లె ఆర్డీఓ జె.పార్థసారథి అన్నారు. ధూళిపూడి, పెద్దవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆర్డీఓ పర్యవేక్షించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చింతాయపాలెంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేలో పాల్గొన్న డీపీఓ రాంబాబు


జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు


ఐలవరంలో 'జగనన్న సురక్ష' సర్వేలో తహసీల్దారు, సర్పంచ్

క్లుప్తంగా

రేపల్లె పట్టణంలో జోరు వర్షం



రేపల్లె రూరల్: నైరుతీ రుతు పవనాల ప్రభావంతో శనివారం తెల్లవారుజాము నుంచి రేపల్లె పట్టణంలో జోరుగా వర్షాలు కురిశాయి. ఇప్పటి వరకు వేసవి ఎండలతో అల్లాడిన పట్టణ ప్రజలు ఈ వర్షంతో కాస్త సేదతీరారు. పట్టణంలో కురిసిన భారీవర్షంతో పలు రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రేపల్లె పట్టణంలో 56.2 మి.మీ, నగరంలో 48.4 మి.మీ, నిజాంపట్నంలో 23.4 మి.మీ, చెరుకుపల్లిలో 60.8 మి.మీ.లుగా వర్షపాతం నమోదయ్యింది.

ఎంఈవో-2 విజయశ్రీ బాధ్యతల స్వీకరణ



కర్లపాలెం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని కర్లపాలెం ఎంఈవో-2 ఎస్.విజయశ్రీ తెలిపారు. ఉల్లిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆమె కర్లపాలెం ఎంఈవో-2గా శనివారం విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన విజయశ్రీని యూటీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా శివయ్య

పిట్టలవానిపాలెం: మండల ప్రజా పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఎం.శివయ్య శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వీరు విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సు మెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మారుతీ శేషమాంబ, ఈఓపీఆర్డీ కె.పద్మజలకు రిపోర్టు చేశారు.

వైభవంగా హోమార్చన

బాపట్ల అర్బన్: బాపట్ల చీలురోడ్ పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం లలితా త్రిపురసుందరీ పీఠం ఆధ్వర్యంలో 'స్కంధషష్ఠి'ని పురస్కరించుకొని హోమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, సుబ్రహ్మణ్య స్వామికి పూజలు, అభిషేకం, దీపారాధన నిర్వహించారు. పీఠ నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు కార్యక్రమాలను నిర్వహించారు. కొల్లిపర వెంకట సదివ వరప్రసాద్, రొంపిచర్ల కేశవాచార్యులు, పరాశరం రఘురామ్, పంగులూరి కౌండిన్య శర్మ, గూడూరు చిట్టిబాబు, భీమవరపు సురేష్ శర్మ, పన్నెండుమంది రుత్విక్కులు, పీఠం భక్తులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గరువుపాలెంలో ఉచిత వైద్యశిబిరం

నిజాంపట్నం: గరువుపాలెం గ్రామంలో బండారు ఫణికుమార్ జ్ఞాపకార్థం అతని మిత్ర బృందం, సేవాభారతి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనవారం నిర్వహించారు. నిర్వాహకులు నాగాంజనేయులు పలువురు వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

బాపట్లటౌన్: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. నో యాక్సిడెంట్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం రోడ్డు ప్రమాదాలపై వాహన చోదకులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంపై ఎస్పీ వకుల్‌జిందాల్ స్పందిస్తూ.. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిగే అనర్థాలను వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు సరిగా పాటించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. దాని ప్రభావం వారి కుటుంబంపై పడుతుందన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని స్పష్టం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్‌ను తప్పనిసరిగా ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

29 నుంచి క్రీడా పాఠశాల ప్రవేశానికి ఎంపికలు

బాపట్ల అర్బన్: కడపలో వైఎస్సార్ రాష్ట్ర క్రీడా పాఠశాలలో 2023-24 ప్రవేశాలకు ఈ నెల 15 నుంచి క్షేత్రస్థాయి ఎంపికలు జరిగాయని క్రీడా ప్రాధికార సంస్థ, బాపట్ల జిల్లా చీఫ్ కోచ్ శనివారం వెల్లడించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపికలు ఈ నెల 23, 24 తేదీల్లో బాపట్ల మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్ర స్థాయికి 29, 30 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ఉంటాయని సీఈఓ తెలిపారు. క్రీడా పాఠశాల ప్రవేశానికి వచ్చే వారు కుల, జనన, ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకు రావాలన్నారు. ఇతర వివరాలకు 98499 09066 నంబరుకు సంప్రదించాలన్నారు.

నేడు పెదపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

భట్టిప్రోలు: పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని పెదపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఉదయం 7గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.

క్షణికావేశంలో పురుగుమందు తాగి..

పిట్టలవానిపాలెం: కోమలి గ్రామానికి చెందిన వివాహిత శ్యామల సంధ్య (25) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చందోలు ఎస్‌ఐ రాజశేఖర్ వివరాల మేరకు కోమలి గ్రామానికి చెందిన బాజిరెడ్డి, సంధ్య భార్యాభర్తలు. వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో.. క్షణికావేశంతో సంధ్య పురుగు మందు తాగింది. వెంటనే వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తీసుకెళ్లగా.. ఆమె చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరికి ఐదేళ్ల వయసు ఉన్న బాలుడు ఉన్నాడు.

బ్లడ్ గ్రూపుపై అవగాహన ఉండాలి

రేపల్లె: విద్యార్థులు తమ బ్లడ్ గ్రూపుపై అవగాహన కలిగి ఉండాలని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్, రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద విద్యావిహార్ హైస్కూలు విద్యార్థులకు శనివారం బ్లడ్ గ్రూపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్లడ్ గ్రూపు తెలిసి ఉంటే.. ఆపత్కాలంలో అవసరమైన వారికి రక్తదానం చేయడం, స్వీకరించడం సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ జగన్నాథ్, డైరెక్టర్ సత్యనారాయణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అడుసు మల్లి ప్రభాకరరావు, సయ్యద్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్
- మండలంలో పలు పాఠశాలల సందర్శన

నిజాంపట్నం: విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. నక్షత్రనగర్, కొత్తూరు, అడవులదీవి, నిజాంపట్నం హార్బర్ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థుల హోంవర్క్‌ను ఉపాధ్యాయులు పరిశీలన చేయకపోవడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే యూనీఫాం, బూట్లు వేసుకోపోవడం, బ్యాగులు తీసుకురాకపోవడాన్ని చూసి, ఉపాధ్యాయులను హెచ్చరించారు. జూన్ 30లోగా అందరికీ యూనీఫాం, బూట్లు, బ్యాగ్స్ అందించాలని ఆదేశించారు. జులై 3 నుంచి విద్యార్థులు తప్పనిసరిగా వాటిని తీసుకుని వచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. పాఠశాలలో బెంచీల కొరతపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నక్షత్రనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కొత్తూరులోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మాట్లాడారు. హార్బర్‌లోని పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లు పంపిణీ చేశారు. అడవులదీవి గ్రామంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయన వెంట డీఈఓ పీవీజే రామారావు, అసిస్టెంట్ సీఎంఓ రజిని, అసిస్టెంట్ ఏఎంవో మోజస్, బాపట్ల జిల్లా జేవీకే ఇన్‌చార్జి కె.జీవనజ్యోతి, పైడి వెంకటరమణ, ఆర్జేడీ సుబ్బారావు, ఎంఈవోలు కొలసాని హరిబాబు, శేషుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

లైసెన్స్ ఉంటేనే విత్తనాలు విక్రయించాలి

చెరుకుపల్లి: వరి విత్తనాలు విక్రయించే దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి టి.బాలాజీ గంగాధర్ హెచ్చరించారు. మండలంలోని విత్తనాల విక్రయ దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. విత్తనాలు కొనేముందు తప్పని సరిగా విత్తన సంచిపై ల్యాట్ నంబరు, గడువు తేదీ చూసుకోవాలన్నారు. 8 నెలలు గడిస్తే మొలక శాతం తగ్గుతుందని తెలిపారు. విత్తనాలు కొన్న ప్రతి రైతు ఆయా దుకాణాల్లో బిల్లు తీసుకోవాలని, అదేవిధంగా ముదుగానే కొన్న విత్తనాలు తీసి మొలక శాతం పరీక్షించాలని వివరించారు. దుకాణదారులు కూడా విత్తనాలను సోర్స్ ఆఫ్ సప్లై సర్టిఫికేట్‌ను సంబధిత కంపెనీ నుంచి గాని, లేదా పంపిణీదారుడి నుంచి పొంది ఉండాలన్నారు. ముఖ్యంగా దుకాణంలో యజమాని పేరు, డోరు నంబరు, లైసెన్సు నంబరు, విత్తన రకాలు నిల్వలు, ధరలను సూచించే బోర్డు ప్రదర్శించాలని స్పష్టం చేశారు.


విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ బాలాజీ గంగాధర్

కౌలు కార్డులతో రైతులు రుణాలు పొందవచ్చు

పిట్టలవానిపాలెం: పంట సాగు హక్కు పత్రాలు తీసుకోవడం వల్ల కౌలు రైతులు రుణాలు పొందవచ్చని తహసీల్దారు కవిత తెలిపారు. ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొలం యజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, 11 నెలల పాటు హక్కు పత్రాల కాల పరిమితి ఉంటుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ల అశ్వినిరెడ్డి, గ్రామ సర్పంచ్ కుంతం అనూష ప్రసన్న రాజు, సొసైటీ చైర్ పర్సన్ కూసంపూడి దేవేంద్రరాజు, మండల వ్యవసాయాధికారి సత్యానంద్, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డు తప్పనిసరి

నగరం: కౌలు రైతులు తప్పనిసరిగా పంటసాగుదారు హక్కు పత్రాలను(సీసీఆర్‌సీ) పొందాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. ఈదుపల్లి, పెదమట్లపూడి, పూడివాడ గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో సీసీఆర్‌సీపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కౌలు రైతు కార్డు తీసుకున్న వారికి మాత్రమే ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయని ఏఓ తెలిపారు. కౌలు రైతులకు కార్డులను అందించారు. ఏఈవో కె.నాగశ్రీనివాసరావు, వీపీఏలు పాల్గొన్నారు.

26, 27న ఉపాధ్యాయుల కమిటీ సమావేశాలు

బాపట్ల అర్బన్: ఈ నెల 28న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'అమ్మ ఒడి' కార్యక్రమం నిర్వహిస్తున్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ సమావేశం నిర్వహించాలని డీఈఓ పీవీజే రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో సమావేశాలు నిర్వహించి, జగనన్న అమ్మఒడి, మన బడి నాడు- నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక అంశాలపై చర్చించాలని పేర్కొన్నారు.

5 గ్రామాలకు నిరంతర విద్యుత్



పిట్టలవానిపాలెం: మండలంలోని 5 గ్రామాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. చందోలులో నూతన నిర్మించిన సబ్ స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. స్విచ్ ఆన్ చేసి, విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనంవారిపాలెం, రెడ్డిపాలెం, బోడిపాలెం, పిట్టువారిపాలెం, నదిముల్లాయపాలెం గ్రామాలకు 3ఫేజ్ విద్యుత్ 24 గంటల పాటు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు పంపించిన అంచనాలు మంజూరయినట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

1 నుంచి 'జగనన్న సురక్ష' శిబిరాలు

చెరుకుపల్లి: వచ్చే నెల 1వ తేదీ నుంచి మండలంలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాలు జరగనున్నాయని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ వలంటీర్ తనకు మ్యాపింగ్ అయిన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పరంగా అవసరమయ్యే సేవలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 1న ఆరేపల్లి, కుంచలవారిపాలెం, 4న పొన్నపల్లి, తుమ్మలపాలెం, 7న నడింపల్లి, రాంబొట్లపాలెం, 11న గూడవల్లి బలుసులపాలెం, 14న తూర్పుపాలెం, కావూరు, 18న కనగాల, ఆరుంబాక, 21న రాజోలు, చెరుకుపల్లి-1 సచివాలయాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. ఉప్పూడి పంచాయతీ పరిధిలోని దాసరిపాలెం, కమ్మావారిపాలెం, ఊలుపాలెం గ్రామాల్లో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకు తావులేకుండా కులమతాలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం ప్రాముఖ్యతను గుర్తించి, వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 230 గృహాలను సందర్శించి, ప్రభుత్వ పథకాలను లబ్దిదారులకు వివరించి, స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కార మార్గాలు చూపారు. కార్యక్రమంలో బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, సర్పంచ్ గుజ్జర్లమూడి విజయబేబి ఇమ్మానుయేలు భాస్కర్, ఎంపీటీసీ అల్లంశెట్టి సతీష్, జెడ్పీటీసీ బొర్రా లక్ష్మీశ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.


దాసరివారిపాలెంలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపు భట్టిప్రోలు మండల సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ గౌరవ, శాశ్వత సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు తమ నివేదికలు కార్యాలయంలో ముందస్తుగా సమర్పించాలని తెలిపారు.

వెల్లటూరులో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన




వెల్లటూరులో స్థల పరిశీలన చేస్తున్న ఏడీఏ భాస్కరరావు

భట్టిప్రోలు: వెల్లటూరులో రూ.3.50 కోట్ల అంచనాలతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని శనివారం రేపల్లె ఏడీఏ నెమలికంటి భాస్కరరావు పరిశీలించారు. వెల్లటూరు కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ సమీపంలోని పిల్ల కాల్వ వద్ద ఉన్న స్థలాన్ని సందర్శించారు. స్థలం పొడవు సరిపోతుందని కానీ వెడల్పు తగ్గుతుందని ఆయన తెలిపారు. సందర్భంగా ఏడీఏ భాస్కరరావు మాట్లాడుతూ సబ్ స్టేషన్ ఏర్పాటైతే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. భట్టిప్రోలు ఇన్‌చార్జ్ ఏఈ ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు నీలా నాగరాజు, గురిందపల్లి సునీల్, దారవత్ స్వామి పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకోండి.. అన్ని విధాల సహకరిస్తాం

కోళ్లపాలెం(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ కోళ్లపాలెంలో హౌసింగ్ డే సందర్భంగా శనివారం గృహ నిర్మాణ లబ్ధిదారులతో అధికారుల బృందం భేటీ అయ్యింది. మండల ప్రత్యేక అధికారి ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. 5 కిలోమీటర్ల దూరంలోని అక్కివారిపాలెం, పెదపాలెం గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడం వల్ల కట్టుకోలేకపోతున్నామని లబ్ధి తెలిపారు. ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నామని, రుణాలు కూడా మంజూరు చేయిస్తున్నామని గృహ నిర్మాణాలు చేపట్టాలని అధికారులు కోరారు. ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎండీ జిక్రియ, వైఎస్సార్ సీపీ నాయకులు నీలా రమేష్, నీలా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి హనుమంతరావు